



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- హాజరైన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 20: జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో మినీ ట్యాంకుబండ్‌ను ఆనుకుని రూ.22కోట్లతో నూతనంగా నిర్మించిన కేంద్రీయ విద్యాలయ భవన ప్రారంభోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ జమ్మూలోని ఐఐఎం నుంచి వర్చువల్ ద్వారా ప్రారంభోత్సవం చేయగా స్థానికంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ, కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన కేంద్రీయ విద్యాలయాలను ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశమంతటా విస్తరిస్తుందన్నారు. నిజామాబాద్‌లో 7.5ఎకరాల విస్తీర్ణంలో రూ.22కోట్లు వెచ్చించి ఎక్కడ కూడా పైసా అవినీతి, పైసా కమీషన్ లేకుండా నూతన భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. పదవ తరగతి వరకు కొనసాగుతున్న ఈ విద్యా సంస్థలో త్వరలోనే 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయడానికి కృషి చేస్తానన్నారు. అలాగే బోధన్ పట్టణం లో కేంద్రీయ విద్యాలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే ఏడాది నుంచి స్వంత భవనం అందుబాటులోకి తెస్తామన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయానికి ఎంతో ఆహ్లాదకరమైన వాతవరణంలో అన్ని వసతులతో కూడిన నూతన భవనం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల దిశగా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యా లయాల్లో చదువుతున విద్యార్థులు దేశభక్తిని పునికిపుచ్చుకుంటున్నా రన్నారు. కేంద్రీయ విద్యాలయ ఆవరణలో తన స్వంత ఖర్చులతో సరస్వతిమాత విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయాల సంస్థల హైదరాబాద్ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ మమత, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'కమిటీల పేరుతో కాంగ్రెస్ కాలయాపన'

పెద్దబజార్, ఫిబ్రవరి 20: రాష్ట్రంలోకి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ఎంపీ అర్వింద్ విమర్శించారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల లబ్ధి కోసం పసుపు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. పసుపు రైతులను ముంచిందే, షుగర్ ఫ్యాక్టరీలను మూసింది కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. రాష్ట్ర మంత్రి తుమ్మల విలువలు లేకుండా మాట్లాడుతున్నారన్నారు. శివాజీ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. జిల్లాలో ర్యాలీలకు అనుమతి ఇవ్వకుండా సీపీ కాంగ్రెస్‌కు వత్తాసు పలుకుతున్నారన్నారు. బడా రాంమందిర్, ఆలయ గేట్లకు కాశయ రంగు తొలగించి నల్లరంగు వేయడాన్ని ఆయన ఖండించారు. కాంగ్రెస్ పార్టీ తీరు ఔరంగజేబు పాలనను మరిపిస్తుందన్నారు. పసుపు రైతులను అభివృద్ధి వైపు మళ్లించేందుకు బీజేపీ భరోసా ఇస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కేటాయింపులపై దర్యాప్తు ముమ్మరం



- జిల్లాలో మిల్లులకు ధాన్యం కేటాయింపులపై కొనసాగుతున్న అధికారుల దర్యాప్తు
- మూడేళ్ల క్రితం పనిచేసిన అధికారుల పాత్రపై ఆరా
- ఒకటి, రెండ్రోజుల్లో బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం



నిజామాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మిల్లులకు ధాన్యం కేటాయింపుల వ్యవహారంలో మిల్లర్లతో పాటు అధికారుల పాత్ర బయటపడుతుండడంతో చర్యలకు ఉన్నతాధికారులు ఉపక్రమిస్తున్నారు. ధాన్యం పక్కదారి పట్టినా పట్టించుకోని అధికారులపై చర్య తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ధాన్యం కేటాయించే సమయంలో పాత్ర వహించిన ప్రధాన మిల్లర్లపై కూడా నజర్ పెట్టారు. ఆ సమయంలో ఎవరెవరు ఒత్తిడి చేసి ఎంతమేరకు ధాన్యాన్ని తరలించారో పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. కొన్ని సీజన్లలో కొన్ని మిల్లులు పనిచేయకున్నా వాటికి ధాన్యం కేటాయించి ఇతర మిల్లులకు పంపించారు. బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారు. ఈ విషయాలు కూడా బయటికి రావడంతో మూడేళ్ల క్రితం పనిచేసిన అధికారుల పాత్రపై కూడా ఆరా తీస్తున్నారు. వారు ఇతర ప్రాంతాల్లో పనిచేసిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది.

రూ.150కోట్ల ధాన్యం పక్కదారి

జిల్లాలో 2021-22 సంవత్సరం, 2022-23 సంవత్సరంలో కేటాయించిన ధాన్యం ఎక్కువగా పక్కదారి పట్టింది. అధికారులు ఈ ధాన్యం కేటాయించగానే అదే సంవత్సరంలో మిల్లర్లు బయట అమ్మకాలు చేశారు. బియ్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కింద ఎఫ్‌సీఐకి అందించలేదు. ఈ రెండు సంవత్సరాల్లో సుమారు రూ.150కోట్ల ధాన్యం పక్కదారి పట్టినట్లు 11మిల్లుల తనిఖీల్లో బయటపడింది. మిగతా మిల్లుల్లో కూడా ఆరాతీస్తున్నారు. కస్టం మిల్లింగ్ అందించని మిల్లుల్లో తనిఖీలను చేస్తున్నారు. మూడేళ్ల క్రితం వానాకాలం, యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసిన అధికారులు ధాన్యం కేటాయింపుల్లో నిబంధనలు పాటించలేదు. రైస్‌మిల్లర్ అసోసియేషన్ ఒత్తిళ్లతో కొన్ని మిల్లులకు ఎక్కువగా, మరికొన్ని మిల్లులకు తక్కువగా కేటాయింపులను చేశారు. వీటిలో రా మిల్లులతో పాటు బాయిల్డ్ మిల్లులు కూడా ఉన్నాయి. కొన్ని మిల్లులు పనిచేయకున్నా వాటికి కూడా కేటాయింపులను చేశారు. ఆ మిల్లులకు ధాన్యం కేటాయించొద్దని, ఒకవేళ కేటాయిస్తే ఇతర మిల్లులకు మళ్లించాలని కోరడంతో మళ్లించారు. ఆ ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని మూడేళ్లయినా ఎఫ్‌సీఐకి లేవీ కింద పెట్టలేదు. ప్రభుత్వం మారిన తర్వాత సివిల్ సప్లయిస్ రివ్యూలో బయటపడడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు. జిల్లాలో రైస్‌మిల్లర్ల అసోసియేషన్‌లో గుర్తింపు పొందిన నేతలతో పాటు ప్రజాప్రతినిధుల అండలున్న మిల్లులకు ఎక్కువగా ఈ ధాన్యం కేటాయింపులు జరిగినట్లు గుర్తించారు. తనిఖీల్లో బయటపడడంతో కేసులను పెట్టి వసూలుకు సిద్ధమవుతున్నారు.

అధికారుల పాత్రపై ఆరా

జిల్లాలో ఈ రెండేళ్ల ధాన్యం కేటాయింపుల సమయంలో పనిచేసిన అధికారుల పాత్రపై కూడా ఆరా తీస్తున్నారు. అప్పుడు ఉన్న అధికారులు ఏ విధంగా కేటాయింపులు చేశారు. నిబంధనలు పాటించారా? నిబంధనలు పాటించకుండా ఎంత మందికి ధాన్యం కేటాయింపులు చేశారు. అప్పటి అధికారుల పాత్ర ఎంతవరకు ఉంది. తర్వాత వచ్చిన అధికారులు ఎంతవరకు చర్యలు తీసుకున్నారు. వీరి హయాంలో కూడా ఎంత ధాన్యాన్ని కేటాయింపులు చేశారు. కస్టం మిల్లింగ్ కింద ఎంత ఎఫ్‌సీఐకి బియ్యాన్ని లేవీ కింద పెట్టారు. ఆరా తీస్తున్నారు. పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థ, సహకార శాఖ అధికారుల పాత్రపై ఆరా తీస్తున్నారు. అప్పుడు వీరిని సమన్వయం చేసిన ఉన్నతాధి కారుల పాత్రపై కూడా నజర్ పెట్టి దర్యాప్తు చేస్తు న్నారు. వీరుకూడా సహకరించినట్లు కొంతమేర బయటపడుతుండడంతో వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ధాన్యం కొనుగోలులో పలు నిబంధనలు ఉల్లంఘిం చినట్లు దర్యాప్తులో అధికారులు గుర్తించినట్లు సమాచారం. వారు పంపించే నివేదికలకు అనుగుణంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. ఇప్పటికే కొంత మంది అధికారులను రాష్ట్ర హెడ్‌క్వార్టర్‌కు బదిలీ చేయగా మరికొంత మంది అధికారులను పంపిం చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ధాన్యం కేటాయింపు వ్యవహారంలో జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్ర అధికారులకు నివేదిక పంపించినట్లు తెలు స్తోంది. ఈ నివేదిక ఆధారంగా ఒకటి రెండు రోజుల్లో మరికొంత మంది అధికారుల పైన చర్య తీసుకునే అవకాశం ఉంది. వీరితోపాటు మిల్లర్ల పాత్ర ఉందని తేలితే ఇప్పటికే పెట్టిన క్రిమినల్ కేసులతో పాటు ఇతర చర్యలను కూడా చేపట్టే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఒకటి రెండ్రోజుల్లో ఏ అధికారిపై చర్యలు తీసుకుంటారో తేలే అవకాశం ఉంది.

లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు పంపిణీ చేయాలి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 20: ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ప్రత్యేకించి జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతమైనందున పంటల రుణాల పంపిణీకి అత్యంత ప్రాధాన్యాన్ని ఇవ్వాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. గత ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి కేటాయించిన లక్ష్యాలను, ప్రగతిని బ్యాంకుల వారీగా సమీక్షించారు. ఈ ఏడాది వ్యవసాయరంగానికి 4062.20 కోట్ల రూపాయల రుణాలు అందించాలని లక్ష్యం కాగా గత డిసెంబర్ నాటికే 2578.40 కోట్లను పంపిణీ చేసి 63.48శాతం లక్ష్యం సాధించినట్లు లీడ్‌బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌రావ్ తెలిపారు. ఖరీఫ్‌కు రూ.2437కోట్ల రుణాలు లక్ష్యం కాగా 1801.72 రుణాలు ఇచ్చినట్లు ప్రస్తుతం రబీ సీజన్‌లో 1625.20 కోట్ల రుణాలు అందించాల్సి ఉందని డిసెంబరు31 నాటికి 776.78 కోట్లు పంపిణీ చేశామన్నారు. మార్చి నెలాఖరు నాటికి లక్ష్యం పూర్తి చేసేలా చేస్తున్నామని ఆయన తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నూటికి నూరు శాతం లక్ష్యం సాధించేందుకు బ్యాంకర్లు దృష్టి పెట్టాలన్నారు. కొన్ని బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుండగా మరి కొన్ని నిస్తేజ వైఖరిని ప్రదర్శిస్తున్నాయని ఈ దోరణిలో మార్పు రావాలన్నారు. రైతులకు అవసరమైన రుణాలు అందించాలని లేదంటే వారు ప్రైవేటు బ్యాంకులను ఆశ్రయించి నష్టపోయే అవకాశం ఉందని, పోడు పట్టాలు పొందిన వారికి సైతం రుణాలు ఇవ్వాలని సూచించారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద దరఖాస్తు చేసుకునే చేతివృత్తుల వారికి సైతం రుణ సహాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ డీజీఎం. అనిల్‌కుమార్, డీఆర్‌డివో సాయగౌడ్, మెప్మా పీడీ రాజేందర్, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాల దరఖాస్తులపై స్పందించాలి

- సీపీ కల్మేశ్వర్ శింగనేవార్



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీపీ

ఖిల్లా, ఫిబ్రవరి 20: ప్రతీ పోలీసు స్టేషన్‌కు వచ్చే సైబర్ నేరాలకు సంబంధించిన దరఖాస్తులను వెంటనే స్పందించి కేసు నమోదు చేయాలని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ అన్నారు. మంగళవారం పుట్ ఆన్‌హోల్డ్ కేసుల్లో స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసిజర్ ఏ విధంగా ఉండాలో టీఎస్ సీఎస్‌బీ డైరక్టర్ సీకా గోయల్ ఆదేశాల మేరకు నగరంలోని పోలీసు కమిషనరేట్ పరిధిలోని పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదుకు సంబంధించిన ఫోన్ నంబర్ ఈ-మెయిల్ ఐడీ తదితర అంశాలు ఎఫ్‌ఐఆర్‌లో పొందుపర్చాలని సూచించారు. సైబర్ నేరాలు జరగకుండా ప్రతి రోజూ ప్రజలకు అవగాహన కల్పించాలని సోషల్ మీడియాలో సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేయాలని సూచించారు. సైబర్ క్రైం ద్వారా ఆర్థికంగా నష్టపోయిన బాధితులు ముందుగా నేషనల్ క్రైమ్ విభాగం హెల్ప్ లైన్ నంబరు 1930 సమాచారం అందజేయడం ద్వారా బాధితులకు సత్వరమే అందించే న్యాయంపై పోలీసు స్టేషన్ అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ హెల్ప్‌లైన్ నంబరు ద్వారా సంబంధిత బాధితుల ఖా తాల నుంచి సైబర్ నేరగాళ్ల డబ్బును మళ్లించబడి న ఖాతాలకు సంబం ధించిన లావాదేవీలను పూర్తిగా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలుపాలన్నారు. ఈ అవగాహన సదస్సులో సైబర్‌క్రైం డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, సీఐ ముఖీత్‌పాషా, ఎస్ఐ పూర్ణేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.



వరి పంటకు మోగి పురుగు

- యాసంగి సాగుకు తెగుళ్ల బెడద
- పంటను ధ్వంసం చేస్తున్న మోగి పురుగు
- ఆందోళన చెందుతున్న రైతులు

డొంకేశ్వర్, ఫిబ్రవరి 20: ఎన్నో ఆశలతో యాసంగి సాగు ప్రారంభించిన రైతులకు ప్రారంభంలోనే తెగుళ్ల బెడద మొదలైంది. గత యాసంగిలో సోకిన మోగి పురుగు ఈ సంవత్సరం కూడా ఆశిస్తోంది. ఎన్నిమందులు పిచికారీ చేసినా పంట కోలుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలు ఖర్చు చేసి పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతోంది.

ఆరు వేల ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది మండల వ్యాప్తంగా ఆరు వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఎన్నాడు లేని విధంగా వరిని మోగి పురుగు ఆశించి వందల ఎకరాల్లో పంటను నాశనం చేస్తుంది. తెగుళ్ల ఉధృతికి నాట్లు వేసిన పొలాలన్నీ ఎర్రబడుతున్నాయి. పిలకలు రావడంలేదు, డిసెంబర్, జనవరి నెలలో నాట్లు వేసిన పొలాల్లో మోగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. గత సంవత్సరం వానాకాలంలో మోగి పురుగు కారణంగా వరిలో తెల్లకంకి ఏర్పడి దిగుబడి సగానికి తగ్గింది.

నాట్లు వేసిన కొద్ది రోజులకే

యాసంగి నాట్లు మొదలై నెల రోజులు దాటింది. నాట్లు వేసిన 15రోజులకు మోగిపురుగు పంటను ఆశించింది. ఎకరానికి రెండు నుంచి నాలుగు వేల వరకు ఖర్చు చేసి మందులు పిచికారీ చేసినా తెగుళ్లు తగ్గడం లేదు. దీంతో పంటను కాపాడేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

రెండుసార్లు పిచికారీ చేశా..

: గోడిసెరం భూమేష్‌రెడ్డి, రైతు, డొంకేశ్వర్

నాలుగు ఎకరాలు వరి సాగు చేస్తున్న నాటికి 15 రోజులకే మోగి పురుగు తగిలింది. ఇప్పటికీ రెండు సార్లు రసాయన మందులు పిచికారీ చేసిన. పది వేల ఖర్చు అయ్యింది. అయిన మోగి పురుగు ఉధృతి తగ్గలేదు. వ్యవసాయ అధికారులు పట్టించుకొని పంటలను కాపాడాలి.

వాతావరణం అనుకూలించక పురుగు ఆశిస్తుంది..

: నరేష్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి

వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండడంతో వరికి మోగి పురుగు ఆశిస్తుంది. నాట్లు వేసిన సమయంలో నారుమడి తూకం కొనలను తుంచి నాట్లు వేయాలి. నారు కోనల్లో మోగి పురుగు గూడు పెడుతోంది. నాట్లు వేశాక అది పంటను తగిలి ఉధృతమవుతుంది. నారుమడిలో కొనలు తుంచితే చాలా వరకు అరికట్టావచ్చు. నాటు వేశాక 15, 25రోజుల వ్యవధిలో త్రీజీ లేదా 4జీ గుళికలు చల్లితే మోగి పురుగును నివారించవచ్చు.



జిల్లాకు ఎస్డీఎఫ్ నిధులు

- అభివృద్ధి పనులకు వెచ్చించనున్న రూ.55కోట్ల నిధులు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో వినియోగం
- పాఠశాలలు, తాగునీటికి మొదట ప్రాధాన్యం

నిజామాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్డీఎఫ్) వచ్చింది. ప్రతి నియోజకవర్గానికి 10కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ నిధులతో అత్యవసర పనులతో పాటు పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు వినియోగించనున్నారు. తాగునీటికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు గ్రామాల్లో రోడ్లు, ఇతర నిర్మాణాలకు నిధులను వెచ్చించనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతులతో పనులను కొనసాగించనున్నారు. ప్రత్యేకంగా విడుదల చేసిన నిధులను ప్రభుత్వం నిర్ణయించిన పనులకు వినియోగించనున్నారు. ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వచ్చిన ప్రతిపాదనలకు అను గుణంగా నిధుల వినియోగం చేయనున్నారు.

నియోజకవర్గానికి రూ.10కోట్లు

ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఒక్కో నియోజకవర్గానికి 10కోట్ల రూపాయల చొప్పున నిధులను విడుదల చేసింది. జిల్లాలో మొత్తం ఆరు నియోజకవర్గాలు కలిపి 55కోట్ల రూపాయలను కేటాయించింది. ఈ నిధులలో బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాల్లో ఒక్కొక్కదానికి 10కోట్ల రూపాయల చొప్పున ఖర్చు చేయనున్నారు. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో జిల్లాలో ఉన్న మండలాల్లో 5కోట్లు, కామారెడ్డి జిల్లాలో ఉన్న మిగతా మండలాలకు మరో 5 కోట్లను కేటాయించనున్నారు. ఈ నిధులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అనుమతితో ఖర్చు చేయనున్నారు. అధికారులు నిర్ణయించిన పనులతో పాటు ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన పనులకు కూడా జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిధులను మంజూరు చేయనున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో అత్యవసర పనులకు కూడా ఈ నిధులను ఖర్చుచేయనున్నారు.

నిధుల వినియోగానికి నిబంధనలు

నిధుల వినియోగానికి ప్రభుత్వం కొన్ని నిబంధనలను విధించింది. ఆయా నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం 2కోట్ల రూపాయలు, తాగునీటి కోసం కోటి రూపాయలు ప్రభుత్వ కార్యాలయాల నిర్వాహణ కోసం 50లక్షల రూపాయలను ఖర్చు చేయనున్నారు. మిగతా ఆరున్నర కోట్లు నియోజకవర్గం పరిధిలోని అత్యవసర పనులకు వినియోగించనున్నారు. రోడ్లు, మురికికాల్వలు, వైద్యసేవలకు వీటిని వినియోగిస్తారు. ఇవేకాకుండా అధికారులు నిర్ణయించిన ముఖ్య మైన పనులకు ఈ నిధులను ఖర్చుచేస్తారు. పనులు ప్రతిపాదించిన తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతులు ఇచ్చిన తర్వాతనే ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనుమతులు లేకుండా పనులు ప్రతిపాదించిన అనుమతులు మాత్రం రావు. నిధులు మొత్తం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో ఖర్చు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో ప్రతి పనికి మంత్రి అనుమతి తీసుకున్న తర్వాతనే పనులు చేపట్టనున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న చోట వారు సూచించిన పనులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. మిగతా చోట్ల నేతలు సూచించిన పనులకు ఖర్చు చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గానికి 3కోట్ల చొప్పున నిధులను ఇవ్వగా, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. ఆ నిధులకు ఎమ్మెల్యేలు నిర్ణయించిన పనులకు ఆమోదం తెలిపారు. నిధులను పనుల కోసం వినియోగించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడడం వల్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎస్‌డీఎఫ్ కింద ఈ నిధులను మంజూరు చేశారు. గతంలో పదహారున్నర కోట్లు మాత్రమే ఎమ్మెల్యేల ద్వారా ఈ నిధులు రాగా ప్రస్తుతం 55కోట్ల రూపాయల నిధులు అభివృద్ధి పనుల కోసం వచ్చాయి. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి నిబంధనలు వచ్చిన తర్వాత అన్ని నియోజకవర్గాల పరిధిలో అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఇప్పటి వరకు ఇంకా నిబంధనలు విడుదల కాలేదని వచ్చిన తర్వాత పనులను మొదలుపెడతామని అధికారులు తెలిపారు.

జన జాతరకు వేళాయె..

నేటి నుంచి మేడారం కుంభమేళా ప్రారంభం

▶▶ నేడు గద్దెకు చేరుకోనున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు ▶▶ నాలుగు రోజుల పాటు పూజలందుకోనున్న వనదేవతలు


మేడారం జాతరకు తరలివస్తున్న భక్తులు

వరంగల్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భుత క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో మేడారం జనగుడారమవుతోంది. ఎడ్లబండ్లు, కాలి నడకన, కార్లు, ఆటోలు, జీపులు, బస్సుల్లో భక్తులు మేడారం చేరుకుంటున్నారు.

నేటి నుంచి జాతర

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమిన రోజైన బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అరణ్యంలోని మేడారంలో జరిగే ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. పూర్తిగా ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ జాతరలో ప్రకృతే దైవంగా.. వనదేవతల స్మారకార్థం నిర్మించిన కర్రల వద్దే పూజలు నిర్వహిస్తారు. వనదేవతలకు పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, ఎదుర్కోళ్ల తో పాటు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా చెల్లిస్తారు.

గద్దెపైకి చేరిన జంపన్న

జాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న కన్నెపల్లి నుంచి మంగళవారం రాత్రి 8గంటలకు జంపన్న వాగు ఒడ్డునున్న గద్దెకు చేరుకున్నారు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో పగిడె రూపంలో ఉన్న జంపన్నను గద్దెపై కొలువుదీర్చి పూజలు చేశారు.


సమ్మక్క గద్దె

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

జాతర తొలిరోజున కన్నెపల్లి ఆడపడుచు సారలమ్మ గద్దెపైకి రానుంది. సారలమ్మ కొలువైన పల్లె కన్నెపల్లిలో బుధవారం ఉదయమే ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సారయ్యతోపాటు మిగతా పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ముగ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయంలో ఆదివాసీ పూజారులు రహస్య పూజలు జరుపుతారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. సారయ్యకు పూనకం రావడంతో ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు సారలమ్మను తీసుకవస్తారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయానికి సారలమ్మ చేరుకుంటుంది.


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక

మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. ఆదివాసీలు కాలినడకన పగిడిద్దరాజును పడిగె రూపంలో తీసుకుని బుధవారం సాయంత్రానికి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు. ఇక పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజులు కూడా బుధవారమే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి బయలుదేరి, మేడారం చేరుకుంటారు. సమ్మక్క ఆలయంలో ముగ్గురికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 8గంటలకల్లా మేడారంలోని గద్దెలపైకి చేరుకుంటారు. దీంతో తొలిరోజు జాతర అట్టహాసంగా ప్రారంభం అవుతుంది.

23న మొక్కులు

జాతరలో మూడోరోజు శుక్రవారం గద్దెలపై సమ్మక్క, సారలమ్మల తోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు చేరుకోవటంతో భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా మొక్కులు చెల్లించేందుకు బారులు తీరుతారు. 23వ తేదీ శుక్రవారం వనదేవతలకు మొక్కులు చెల్లింపులు చేస్తారు. తీరొక్క మొక్కులతో వనదేవతలను శరణ కోరుతారు.

22న సమ్మక్క ఆగమనం

జాతరలో రెండోరోజైన గురువారం 22న మేడారంలోని చిలుకలగుట్టపై రహస్య ప్రాంతంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్యతో పాటు వడ్డెలు మునిందర్, బొక్కయ్య ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కుంకుమ భరణి రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకుని ప్రధాన పూజారి కిష్టయ్య చిలుకలగుట్టపై నుంచి కిందకు వస్తున్న క్రమంలో ములుగు ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్క రాకను స్వాగతిస్తారు. ఆ సమయంలో కోట్లాది భక్తుల జయజయ నినాదాలతో మేడారం హోరెత్తుతుంది. సమ్మక్క ఆగమనంతో దారి పొడువునా వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ల తలలు తెగి రక్తం చిందిస్తాయి. పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి 10గంటల కల్లా సమ్మక్క గద్దెకు చేరుకోవటంతో మహాజాతర తుది ఘట్టానికి చేరుకుంటుంది.

24న వనప్రవేశం

జాతరలో చివరి రోజైన నాలుగో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సమ్మక్క తిరిగి చిలుకలగుట్టకు తిరుగు ప్రయాణం అవుతుంది. సమ్మక్క వన ప్రవేశంతో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వారి స్వగ్రామాలకు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.


కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొస్తూ ప్రతిష్టిస్తున్న వడ్డెలు


మేడారం దారిలో వాహనాల బారులు..


మంగపేట మండలం కమలాపురం నుంచి ఎడ్లబండ్లపై జాతర కొస్తున్న భక్తులు


సారలమ్మ గద్దె



నాగిరెడ్డిపేటలో ఎంపీటీసీల నిరసన

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 20:ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ మండల ఎంపీటీసీ సభ్యులు తీవ్ర నిరసనలు వ్యక్తంచేశారు.చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ముగించుకుని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు వెళ్లిన అనంతరం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఎంపీపీ రాజ్‌దాస్, స్థానిక తహసీల్దార్ లక్ష్మణ్‌ల ఎదుట తమకు జరిగిన అన్యాయం గురించి కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించక పోవడం గురించి ఎంపీటీసీలు మొర పెడుతూ వాగ్వాదానికి దిగారు. దీంతో తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీటీసీలకు క్షమాపణ చెప్పారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బోధన్ రూరల్, ఫిబ్రవరి 20: మార్చి 3వ తేదీ నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ అన్నారు. మంగళవారం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన్‌లో సుమారు 38 వేల మంది 5 సంవత్సరాల లోపు పిల్లలు ఉన్నా రని పేర్కొన్నారు. పల్స్ పోలియో చుక్కలు పిల్లలందరికీ వేసేలా వైద్య సిబ్బం ది పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. బోధన్ డివిజన్‌లో 256 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొ న్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ విద్య, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణతో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కోటగిరి,ఫిబ్రవరి20: కోటగిరి మండల కేంద్రంలో సోమవారం రాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. పేకాట కేంద్రం వద్ద రూ.12,300 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బోరు మోటార్లు బీఆర్ఎస్ నేతలు తీసుకెళ్లారు

● తమ ఇళ్లల్లో బిగించుకుని వాడుకుంటున్నారు

● డీఎల్‌పీవో నాగరాజ్‌కు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

బీర్కూర్, ఫిబ్రవరి 20: బీర్కూర్‌లోని ఆయా కాలనీల్లో ప్రజల దాహార్తిని తీర్చేందు కోసం ఏర్పాటు చేసిన బోరు మోటార్లను కొంత మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన నేతలు తీసుకుపోయి తమ ఇళ్లల్లో బిగించుకుని వాడుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు డీఎల్‌పీవో నాగరాజ్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం డీఎల్‌పీవో నాగరాజ్ బీర్కూర్‌కు విచ్చేసి, జీపీనితనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డీఎల్‌పీవోను కలిసి స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.తాగునీటి ట్యాంకులను నింపే పైప్‌లైన్ల నుంచి కొందరు నాయకులు తమ ఇళ్లకు నేరుగా కనెక్షన్ తీసుకున్నారని చెప్పారు.వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డీఎల్‌పీవోను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు బస్వరాజ్, చందు, కార్యకర్తలు ఉన్నారు.

బోధన్ మున్సిపల్ డీఈ బదిలీ

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 20: బోధన్ మున్సిపల్ డీఈగా విధులు నిర్వహించిన శివానందం కామారెడ్డి మున్సిపాలిటీ డీఈగా బదిలీపై వెళ్లారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డీఈగా విధులు నిర్వహించిన సుదర్శన్‌రెడ్డి బోధన్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు.

కమ్మర్‌పల్లిలో బ్రహ్మంగారి జాతర ఉత్సవాలు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 20: కమ్మర్‌పల్లి శ్రీగిరి గుట్టపై కొలువుదీరిన కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జాతరా ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి.ఈసందర్భంగా స్వామివారి పల్లకీని స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి గ్రామకమిటీ సభ్యులు గుట్టపైకి చేర్చారు.మంగళవాద్యాలతో పల్లకీ ఊరేగింపు నిర్వహించారు.ఈనెల 24న స్వామివారి కల్యాణం, రథోత్సవ కార్యక్రమాలతోపాటు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మల్లయ్య యాదవ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.పల్లకి ఊరేగింపులో వీడీసీ సభ్యులు,ఆలయఅర్చకులు,కోశాధికారి పాలకవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

పిట్లం, ఫిబ్రవరి 20: నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావ్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్, కిష్టాపూర్ తండా గ్రామాలలో కాంగ్రెస్‌పార్టీ విజయోత్సవ సభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీ కాంతరావ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో అడ్వకేట్ రాంరెడ్డి, మురళీధర్ గౌడ్,బోడ్లరాజు, సుధాకర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ విద్యార్థులకు ఒలంపియాడ్ అవార్డులు

సిరికొండ ఫిబ్రవరి 20: వీరామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సైన్స్, గణితం ఒలంపియాడ్ పోటీ పరీక్షలో సిరికొండ సత్యాశోధక్ పాఠశాల విద్యార్థులు విజయభేరి మోగించారు.విజేతలైన విద్యార్థులకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ బహుమతి ప్రదానం చేశారు.తెలంగాణ ఆదాయ పన్నులశాఖ కమిషనర్ జీవన్‌లాల్,ట్రస్మ రాష్ట్రఅధ్యక్షుడు మధుసూదన్ పాల్గొన్నారు.జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఇలాంటి ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విషయపరిజ్ఞానం,జనరల్‌నాలెడ్జి,సామాజిక అంశాలపై అవగాహన ఉండాలన్నారు.

మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి

సాలూర,ఫిబ్రవరి 20: సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విద్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థానానికి వెళ్లాలి



మాట్లాడుతున్న డీఐఈవో రఘురాం

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి20: విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని డీఐఈవో రఘురాజ్ అన్నారు. మంగళవారం ఆర్మూర్ పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడా దినోత్సవం, ఫెర్‌వేల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇంటర్ తర్వాత తమకు ఇష్టమైన కోర్సుల్లో చేరి రాణిం చేందుకు కృషి చేయాలన్నారు.చదువులో లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటి సాధనకు ప్రయత్నిస్తే విజయం మీ సొంతమవుతుందన్నారు. ఈ సం దర్భంగా పదవీ విరమణ చేయనున్న ప్రిన్సిపాల్ మాజిద్, అక్బరీబేగం లను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యా ర్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తోటి విద్యార్థు లను అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు దేవరాం, పీడీ గంగాధర్, వెంకటేష్, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి



స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

నవీపేట,ఫిబ్రవరి20: జిల్లాలో యూరియాతో పాటు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మండలంలోని నవీపేట, పొతంగల్, నాళేశ్వర్ గ్రామాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లాలో అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఈ విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో సురేష్ గౌడ్, బినోల సొసైటీ ఛైర్మన్ హన్మాండ్లు, నవీపేట, బినోల సొసైటీల కార్యదర్శులు మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నందిపేట: నందిపేట మండలంలోని మల్లారం గ్రామంలో మంగళవారం పంటల నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయాధికారి వాజీద్‌హుస్సేన్ పరిశీలించారు. ఈయాసంగి పంటలో సర్వే నెంబర్ల వారిగా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పంటలను పరిశీలిస్తున్నారని, ఏ పంట వేశారో నమోదు చేస్తున్నారా అన్నారు. క్షేత్రస్థాయిలో నమోదు చేసిన వివరాలను సేకరించి సీటీఇ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. క్రాప్ బుకింగ్ ద్వారా పంటల సాగు వివరాలు, దిగుబడి తెలుస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో జోష్నభవాని, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మూడో విప్లవ పార్టీల ఐక్యత మహాసభను జయప్రదం చేయాలి

పెద్దబజార్, ఫిబ్రవరి 20: మూడో విప్లవ పార్టీల ఐక్యత మహాసభను జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్(ప్రజాపంథ) నగర కార్యదర్శి ఎం.సుధాకర్ అన్నారు. నగరంలోని కోటగల్లీలో గల ఎన్ఆర్ భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మార్చి 3,4,5,తేదీల్లో ఖమ్మంలో జరిగే ఐక్యత మహాసభను విజయవంతం చేయాలన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశపెట్టుబడి దారి విధానం విసిరే సవాల్‌ను అధికమించడానికి కమ్యూనిస్టు విప్లవ ఉద్యమం సైతం మార్పులు చెప్పుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గోదావరి, సంధ్యరాణి, పీడీఎస్ జిల్లాకార్యాదర్శి గణేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలాన్ని అధికార బృందం పరిశీలన

ధర్పల్లి, ఫిబ్రవరి20: మండలంలోని రేకులపల్లి గ్రామంలో గల వివాదస్పద స్థలాన్ని అధికారులు మంగళవారం పరిశీలించారు. తహసీల్దార్ మాలతి, ఎక్సైజ్ సీఐ, ఆర్ఐ ఇరిగేషన్ సర్వేయర్‌ల బృందం పరిశీలించి ఇరువర్గాలను సముదాయించారు. ఇటీవల గ్రామంలో గీత కార్మికులు నాటిన ఈత వనానికి సంబంధించిన మొక్కలను దగ్ధం చేశారు. దీంతో గ్రామానికి చెందిన మత్స్యకారులకు, గీతకార్మికుల మధ్య వివాదం తలెత్తింది. గ్రామశివారులో గల శిఖం భూమిలో మత్స్యకారులు గంగమ్మ దేవాలయాన్ని నిర్మించేందుకు కేటాయిస్తున్నారు. అక్కడ గల గీత కార్మికులకు చెందిన ఈ మొక్కలను దగ్ధం చేసి చదును చేశారు. దీంతో గీత కార్మికులు తహసీల్దార్, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దంతో అధికారుల బృందం పరిశీలించారు. శిఖం భూమిలో ఏలాంటి నిర్మాణాలు చేపట్టరాదని సూచించారు.. ఈతవనం దగ్ధం చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు. ఇరువర్గాలు సంయమనం పాటించాలని సూచించారు.



ఇరువర్గాలతో మాట్లాడుతున్న అధికారులు

బీసీ కుల గణనపై హర్షం

● జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



నగరంలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



రుద్రూర్‌లో..



ఆర్మూర్‌లో..

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 20: బీసీ కులగణనపై జిల్లా కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయమై జిల్లా ఓబీసీ కాంగ్రెస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టీవిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీసీల అభివృద్ధి కోసం కులగణన అని మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ బీసీల సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు.రాహుల్‌గాంధీ ఆదేశంమేరకు త్వరలో రాష్ట్రంలో బీసీల గణన జరుగనుందన్నారు.ఈకార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నరేం దర్‌గౌడ్, నగర బీసీసెల్ అధ్యక్షుడు నాగరాజు, నగర మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు రేవతి, పంచరెడ్డి చరణ్, కిషన్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: రాష్ట్ర కాంగ్రెస్ అసెంబ్లీ సమావేశాల్లో బీసీ కులగణన తీర్మానం చేయడం హర్షనీయమని మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్ అన్నారు.మంగళవారం డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు మండల కాంగ్రెస్ ప్రతినిధులు పొలసాని శ్రీనివాస్, కంచెట్టి గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, మాసిపెద్ది రాజన్నలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పొలసాని మాట్లాడుతూ.. బీసీ కుల గణనతో బీసీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్ మాట్లాడుతూ.. బీసీల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, కులమతాలకు అతీతంగా ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి సహకారంతో నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు.ఈకార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మురళి, ఇబ్రహీం, సాజీద్, రాజన్న, పులి వెంకటేశ్వరరావు,ఎంపీటీసీ సభ్యులు నర్సయ్య పాల్గొన్నారు.

నవీపేట: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌ల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, బీసీసెల్ మండల అధ్యక్షుడు చామంతి రాజు, గోవర్ధన్ రెడ్డి, బాల్‌చందర్ గౌడ్, మోస్రా సాయిరెడ్డి, భగవాన్, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా రవీందర్, జబీర్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సిరికొండ మండలానికి చెందిన బీసీ సెల్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలో బీసీ కుల గణన కోసం శాసన సభలో తీర్మానించినందున మండలానికి చెందిన బీసీ సెల్ మండల అధ్యక్షుడు పిట్ల నర్సింగ్ ఆధ్వర్యంలో సిరికొండ తెలంగాణ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మహేష్‌కుమార్ గౌడ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో ఎర్రన్న,సంతోష్,ఆసీఫ్,మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

వర్ని: మండల కేంద్రంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు నారెడ్ల సాయిలు ఆధ్వర్యంలో మంగళవారం సీఎం కేసీఆర్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బీసీ కుల గణన బిల్లు ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కులకర్ణి సురేష్ బాబా, టౌన్ ప్రెసిడెంట్ మొయినోద్దీన్, ఉపాధ్యక్షుడు రెడ్డి రాంబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ గంగప్ప, మైనారిటీ మండల అధ్యక్షుడు శంషోద్దీన్, సేవాదళ్ మండల అధ్యక్షుడు హన్మంతు రావు, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ నేమాని వీర్రాజు, ముత్యాల కృష్ణ, రాజు, ముక్తాక్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండల కేంద్రంలో ఓబీసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పట్ల సురేష్ అధ్యక్షతన ఓబీసీ కుల గణన బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.ఈ సందర్భంగా రుద్రూరు మండల అధ్యక్షుడు తోటఅరుణ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీలో ఓబీసీ బిల్లును ప్రవేశపెట్టినందుకు స్వాగతిస్తూ కేంద్రంలో బీజేపీ వైఖరిని ఎండ గడుతూ పార్లమెంట్‌లో ఓబీసీ కుల గణన బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నడిపింటి నగేష్, ఎంపీటీసీ గౌస్, మైనారిటీ మండల అధ్యక్షుడు మగ్దూం, నాయకులు పాల్గొన్నారు.

పెర్కిట్: శాసనభలో బీసీ సమగ్ర కుల గణన తీర్మాణాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల హర్షిస్తూ మంగళవారం ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద బీసీ అధ్యక్షుడు దొండి రమణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60శాతం ఉన్నత బీసీలు కాంగ్రెస్ పార్టీకి అండా ఉంటామని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధికారం కట్టబెట్టిన విధంగానే లోక్‌సభ ఎన్నికలలో 17స్థానాలు గెలిచే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ తప్పుడు ప్రచారం మానుకోవాలి

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 20: ఎంపీ అర్వింద్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు, తప్పుడు ప్రచారాలు మానుకోవాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాలమోహన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి గడుగుగంగాధర్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నగర అధ్యక్షుడు కేశవేణులు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని అర్వింద్‌కు వ్యతిరేకంగా బీజేపీ నాయకులు చేస్తున్న పనుల వెనుక కాంగ్రెస్ నాయకులు ఉన్నారని అర్వింద్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని అది ప్రజలు గమనిస్తున్నారని అర్వింద్ అహంకారం జిల్లా ప్రజలకు తెలుసన్నారు. ఐదేళ్లుగా ఎంపీ అర్వింద్ చేసిన అభివృద్ధి ఏమి లేదని అందువల్లే కోరుట్ల ప్రజలు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడించారన్నారు. మళ్లీ అసమర్థ అర్వింద్ ఎంపి కావడం ఇష్టం లేని బీజేపీ కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా ధర్నాలు చేస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారన్నారు. 45ఏళ్లుగా మచ్చలేని నాయకుడు జీవన్‌రెడ్డి అని ఆలాంటి వ్యక్తిపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంటు స్థానం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసు కుంటుందని, గతంలో కవితకు పట్టిన గతే వచ్చే ఎన్నికల్లో అర్వింద్‌కు పడుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు అంతరెడ్డిరాజరెడ్డి, రత్నాకర్, సంతోష్, సుమన్, శివ, బింగిమధు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి, తదితరులు

వైభవంగా సీతారామచంద్ర ధ్వజారోహణం

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 20:చారిత్రాత్మక ఖిల్లా డిచ్‌పల్లి రామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో వేద బ్రాహ్మణులు ధ్వజారోహన కార్యక్రమాన్ని అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ జంగం శాంతయ్య ఆలయ కమిటీ డైరెక్టర్‌లు నర్సారెడ్డి, పోశెట్టి, మాధురి, జితేందర్‌ల సమక్షంలో ఆలయ ధర్మకర్త రాందాస్, మాజీ సర్పంచ్ రాధాకిష్టరెడ్డి, విండో మాజీ ఛైర్మన్ జైపాల్ సమ క్షంలో పున్యవచనం, అగ్ని ప్రతిష్ఠ, దేవత ఆహ్వానం, నిత్యహోమం, బలిహరనం, హనుమంత సేవా, నివేదన, ఆరతి మంత్ర పుష్పం కార్యక్రమాలను వైభోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు గజ వాడ జైపాల్, విజయనాథ్, గజవాడ రాములు, కుటుంబ సభ్యులు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ నిర్వహకులు విగ్రహలను సర్వం గ సుందరంగా తీర్చిదిద్దారు.

● నేడు కల్యాణోత్సవం

సీతరామ చంద్ర బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాగశుద్ధ త్రయోదశి బుధవారం (నేడు) మధ్యాహ్నం 3గంటలకు సీతరాముల వారి కల్యాణం కన్నుల పండుగగా సాగుతోందని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కల్యాణోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావలని కోరారు.విద్యుత్ దీపాలతో రామాలయం దగదగమెరుస్తుంది.



ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహనం నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పెద్దబజార్, ఫిబ్రవరి 20: కేంద్రంలో ఉన్న ప్రభుత్వం హెల్త్ డిపార్ట్‌మెంటులో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జిల్లాలో హెల్త్ డిపార్ట్‌మెంటులో పని చేస్తున్న ఉద్యోగులు సీఐటీయూలో చేరారు. ఆమె మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీగా పని చేస్తున్న వారిని సీహెచ్ఎల్‌గా గుర్తించాలని వేతనాలను పెంచాలని, పీఎఫ్ ఇతర చట్టబద్ధ సౌకర్యాలను అమలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అక్షయ్య, తబిత, వంశీ, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బోధన్ రూరల్, ఫిబ్రవరి20: ప్రభుత్వ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ మధుమాలాంచ కళాశాల ప్రిన్సిపాల్ కల్పన కుమారి అన్నారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు.జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకై సాంకేతిక రంగాల్లో రాణించాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి ప్రణాళికలతో చదవాలని విద్యార్థులకు సూచించారు.మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వ కళాశాల కు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శివకుమార్, సురేష్, జగదీష్, లక్ష్మణ్ చౌహన్, తదిత రులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

సంక్షిప్త సమాచారం

కుల బహిష్కరణ చేసిన వారిపై కేసు నమోదు

కోటగిరి,ఫిబ్రవరి20: కోటగిరి మండల కేంద్రానికి చెందిన ఓ కుటుంబంపై కుల బహిష్కరణ చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. గ్రామానికి చెందిన ఇందూరు స్వాతి వారి అమ్మమ్మ చనిపోయినప్పుడు దహన సంస్కారాలు చేయడానికి కులపెద్దలను పిలిచినట్లు ఎస్ఐతెలిపారు. బేగరి రాములు,పాలగంగారాం, జంగంసాయిలు అనే వ్యక్తులు తమకు రూ.లక్ష ఇస్తేనే దహన సంస్కారాలకు వస్తామని చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు. ఇవ్వలేని పక్షంలో ఈముగ్గురు వ్యక్తులు తమను కులబహిష్కరణ చేసినట్లు స్వాతి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాయకూర్‌లో మొరం తవ్వకాలు నియంత్రించాలి

రుద్రూరు,ఫిబ్రవరి 20:రుద్రూరు మండలం రాయకూర్ గుట్ట ప్రాంతంలో మొరం తవ్వకాలు నియంత్రించాలని స్థానికులు మంగళవారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నజీర్‌కు వినతి ప త్రం అందజేశారు.మొరం తవ్వకాల వల్ల అతి పురాతనమైన దర్గా పరిసరాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొరం తవ్వకాలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో లతిఫ్, సయ్యద్ అహ్మద్, సాధిక్ ఉన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

బోధన్ రూరల్, ఫిబ్రవరి 20 :బోధన్, సాలూర, రెంజల్, ఎడపల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో పన్నుల వసూళ్లపై ప్రత్యేక అధికా రులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా అన్నారు.మంగళవారం బోధన్ ఎంపీడీవో కార్యాలయంలో పన్నుల వసూళ్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలన్నారు.ప్రత్యేక అధికారులు,పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్, ఎంపీవో మధుకర్‌లతో పంచాయితీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: కంపోస్ట్ షెడ్డులలో తడి, పొడి చెత్తను వేరు చేయాలని బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా సూచించారు. పోతంగల్ మండలంలోని జల్లాపల్లి ఫారం, జల్లాపల్లి గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించారు. గ్రామ పంచాయతీలలో పలు రికార్డులను పరిశీలించారు. పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం గ్రామాల సమీపంలో ఉన్న కంపోస్ట్ షెడ్డులను పరిశీలించారు. తడి, పొడి చెత్తను షెడ్లలో వేయకుండా రహదారుల వెంట వేస్తే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు.ఆయన వెంట ఎంపీవో మారుతి, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

డిచ్‌పల్లి: గ్రామాల అభివృద్ధికి గ్రామ పంచాయతీ పరిధి లోని ట్యాక్స్‌ల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. మంగళవారం డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి జీపీని ఆయన ఆకస్మికంగా సందర్శిం చారు.ప్రతి రోజు తాగు నీరు, పారిశుధ్య పనులపై ప్రత్యేక చొరవ చూపాలని ఆయన సూచించారు.ఆయన వెంట కార్యదర్శి వినయ్ ఉన్నారు.

ఆడ పిల్లలు సమాజానికి మణిహారాలు

రెంజల్,ఫిబ్రవరి20: ఆడ పిల్లలు సమాజానికి మణిహారాలు అని మహిళ శిశు సంక్షేమ అధికారి రసూల్ బీ అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బేటి బచావో.. బేటి పడావో అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఆడ పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలని, 18సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, సూపరిండెంట్ శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి, ఎంపీవోగౌస్, ఎంఈవోగణేష్ రావు, ఏపీఎం చిన్నయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 20: బోధన్ మండలం సిద్ధాపూర్ గ్రామశివారు నుంచి బోధన్ వైపు అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేశామని బోధన్ రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లతో పాటు టిప్పర్లను పట్టుకున్నామన్నారు. అనుమతితో ఉన్న ఇసుక ట్రాక్టర్లు వేగంగా నడప వద్దని ట్రాక్టర్ డ్రైవర్లకు సూచించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కోటగిరి,ఫిబ్రవరి20: కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన రాజశేఖర్(35)అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. రాజశేఖర్ ఓ ప్రైవేట్ స్కూల్‌లో పని చేస్తున్నాడు. నిలకడ లేని మనసత్వం కలిగి ఉండడంతో అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. గత నెల 31వ తేదీన స్కూల్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ నెల 16వ తేదిన ఇంటికి వచ్చిన రాజశేఖర్ తనను ఎవరైనా ఏమైనా అంటారని భావించి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పుపెట్టుకున్నాడు. తీవ్ర గాయాల పాలైన అతనిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,150	రూ.59,150	రూ.750

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మదమే వెబ్ (ఇంగ్లీష్) (12.20)
: తేరి బాతోన్‌మే అయిసాఉల్జాదీయా (3.00)
: ఓయ్ (6.10)
: ఊరుపేరు భైరవకోన (9.40)
స్క్రీన్-2 : ఈగల్ (12.00, 10.00)
: హనుమాన్ (3.20, 6.40)
స్క్రీన్-3 : హనుమాన్ (12.30)
: మదమే వెబ్-ఇంగ్లీష్ (4.20, 10.05)
: శివరాయాంచ చావ (మరాఠి) (7.00)
స్క్రీన్-4 : ప్రవీణ్ ఐపీఎస్ (12.50)
: ఊరుపేరు భైరవకోన (4.20)
: మదమే వెబ్-ఇంగ్లీష్ (7.20)
: తేరి బాతోన్‌మే అయిసాఉల్జాదీయా (10.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఊరుపేరు భైరవకోన (1.40, 7.35, 10.30)
: హనుమాన్ (4.30)
స్క్రీన్-2 : ఈగల్ (10.00, 10.30)
: ఓయ్ (1.00, 4.10, 7.20)
స్క్రీన్-3 : ఈగల్ (1.30, 4.30, 7.30)
: హనుమాన్ (10.30)



దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : ఈగల్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రాజధాని ఫైల్స్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్